చివరి గింజలకు పరితపన

- తుపాను ప్రభావంతో భారీగా పంట నష్టం
- తెరిపిచ్చిన వాతావరణం
- పంట ఒబ్బిడిలో అన్నదాతలు బిజీబిజీ

తుని: అన్నదాతలపై ప్రకృతి కన్నెర్రజేస్తోంది. ఏటా ఆరుగాలం శ్రమించిన పంట చేతికందే సమయంలో వరదలు, తుపానులు సంభవించి రైతులకు నష్టాన్ని మిగుల్చుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి ప్రతికూల వాతావరణం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాభావ పరిస్థితుల నడుమ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని సాగు చేసిన పంట చివరికి నీటిపాలయ్యింది. మిచాంగ్ తుపాను ప్రభావంతో విస్తారంగా కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లో కోసి పనలపై ఉన్న వరి పంట తడిసిపోయింది. కొన్ని గ్రామాల్లో పక్వానికి చేరిన వరిపంట నేలకొరిగింది. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట కళ్ల ముందే నీటి పాలు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా గురువారం వాతావరణం తెరిపివ్వడంతో రైతులు పంట ఒబ్బిడిలో బిజీగా మారారు. తడిసిన ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబెట్టి మిల్లులకు తరలిస్తున్నారు.

12,597 హెక్టార్లలో వరి సాగు

ఈ ఏడాది తుని సబ్‌డివిజన్ పరిధిలోని తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో 12,597 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. ఇప్పటికే సగం విస్తీర్ణంలో పంట పక్వానికి చేరగా 3,735 ఎకరాల్లో పంట కోసి పనలపై ఉంది. ఈ నేపథ్యంలో భారీ వర్షాలు రావడం ఒత పంట తడిసి ముద్దయ్యింది.



కిర్లంపూడిలో ధాన్యం ఆరబెడుతున్న రైతులు

తుని సబ్‌డివిజన్ పరిధిలో వరిసాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	పనలపై పంట (ఎకరాల్లో)
తుని	1766	55
కోటనందూరు	38	45
తొండంగి	4766	2698
రౌతులపూడి	1479	147
శంఖవరం	741	295
మెత్తం	12,597	3735

రైతులకు అండగా అధికారులు

వ్యవసాయాధికారులు కష్టకాలంలో రైతులకు అండగా నిలుస్తున్నారు. తుపానుకు పంట దెబ్బతిన్న ప్రాంతాల్లో అధికారులు విస్తృతంగా పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. సస్య రక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.



జగపతినగరంలో నీట మునిగిన వరి పంటలను పరిశీలిస్తున్న అధికారులు

పంట ఒబ్బిడిలో అన్నదాతలు బిజీబిజీ

కిర్లంపూడి: తుపాను ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలు తెరిపివ్వడంతో అన్నదాతలు పంట ఒబ్బిడిలో బిజీబిజీగా ఉన్నారు. గురువారం ఉదయం నుంచి ఎండ కాయడంతో కళ్లాల్లో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టారు. మరికొన్ని చోట్ల ఆరిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు.

పంట తడిచిపోయింది



ఈ ఏడాది రెండున్నర ఎకరాల్లో వరిసాగు చేశాను. తుపాను ఉందని తెలిసినా పంట పండిపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కోసేశాను. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పనలపై ఉన్న పంట తడిచి పోతోంది. ఏం చేయాలో పాలుపోవడం లేదు. ప్రభుత్వమే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

కరక అప్పలనాయుడు, రైతు, కేఈ చిన్నయ్యపాలెం, కోటనందూరు మండలం

పంట నష్టం అంచనా వేస్తున్నాం



మిచాంగ్ తుపాను ప్రభావంతో పలు గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నారు. పలు చోట్ల పనలపై ఉన్న పంట నీట మునిగింది. రైతులు పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పంట నష్టం అంచనా వేస్తున్నాం. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం.

బుల్లిబాబు, ఏడీఏ, తుని సబ్‌డివిజన్

క్లుప్తంగా

కళాకారుడికి సత్కారం



ధర్మవరంలో పగటి వేష కళాకారుడు రాఘవను సన్మానిస్తున్న నూకరాజు నాయుడు తదితరులు

ప్రత్తిపాడు రూరల్: రంగస్థల కళాకారులను ప్రోత్సహించాలని స్థానిక వీరవెంకట విజయ దుర్గా నాట్యమండలి అధ్యక్షుడు సానా నూకరాజు నాయుడు కోరారు. మండలంలోని ధర్మవరంలో ఆదివారం రాజమహేంద్రవరానికి చెందిన పగటి వేషాలు, నాటక కళాకారుడు రాఘవను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సానా తాతీలు, సిద్దం పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

ఏలేశ్వరం: సామర్లకోటలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఏలేశ్వరం విద్యార్థులు ప్రతిభ చూపినట్టు స్థానిక డ్రాగన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మార్షల్స్ ఆర్ట్ నిర్వాహకుడు శిడగం శ్రీనివాసరావు తెలిపారు. విక్టరీ షూట్‌కాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఏలేశ్వరం విద్యార్థుల గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. పట్టణంలోని డ్రాగన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మార్షల్స్ ఆర్ట్‌కు చెందిన విద్యార్థి దిమ్మల మధుకిరణ్ ఆరంజ్ బెల్ట్ విభాగంలో గోల్డ్ మెడల్, ఎల్లో బెల్టు విభాగంలో దినేష్ కార్తీక్ సిల్వర్ మెడల్ సాధించారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను నిర్వాహకులు మెడల్స్, మెమెంటోలతో సత్కరించారు.

ప్రమాదకరంగా గొయ్యి



ప్రధానరహదారికి చెంతనే ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

ఏలేశ్వరం: పట్టణంలో తాగునీటి పైపులైన్ల నిమిత్తం తవ్వి వదిలేసిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ప్రధాన రహదారిని ఆనుకుని గొయ్యి తవ్వి వదిలివేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పది రోజుల క్రితం పైపులైన్ నిమిత్తం స్థానిక ఆర్‌సీఎం చర్చి నుంచి వేంకటేశ్వరా ఫంక్షన్ హాలు వరకూ ప్రధాన రహదారికి సమాంతరంగా గొయ్యి తీశారు. కొన్ని చోట్ల పైపులు వేసి మట్టితో మూసివేయగా వేంకటేశ్వరా ఫంక్షన్ హాలు ఎదురుగా గొయ్యిని వదిలేశారు. ప్రధాన రహదారిని ఆనుకుని గొయ్యి వదిలివేయడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. కాగా పూడ్చివేసిన గోతుల్లో మట్టి ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోవడంతో ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి



తునిలో ధన్వంతరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీహెచ్‌ఎంపీఏ ప్రతినిధులు

తుని: ఆయుర్వేద వైద్య పితామహుడు ధన్వంతరి జయంతి వేడుకలను తునిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బేసిక్ హెల్త్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ధన్వంతరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రకృతిలో దొరికే సహజన వన మూలికలతో పలు రోగాల నివారణకు మార్గం చూపిన ధన్వంతరిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ నేరెళ్ల సత్యనారాయణ సూచించారు. బీహెచ్‌ఎంపీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కరెళ్ల గణపతిరావు, ప్రధాన కార్యదర్శి కోటి బాబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వజ్రపు వినోద్‌కుమార్, సత్యనారాయణ, సురేష్, కమలయ్య పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీలు

సామర్లకోట: స్థానిక వివేకానంద గ్రంథాలయంలో ఆదివారం భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పి.రవిశంకర్ పట్నాయక్ ప్రారంభించారు. 66 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు పట్నాయక్ తెలిపారు. ఎల్‌కేజీ నుంచి 3వ తరగతి విభాగంలో తణుకు హారిక ప్రథమ, కంచర్ల మోక్ష ద్వితీయ, కంచర్ల జ్యోతి తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వీహెచ్‌పీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీల రథయాత్రను విజయవంతం చేయాలి



జగ్గంపేటలో రథయాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన బీసీ సంఘ అధ్యక్షుడు లోవరాజు

జగ్గంపేట: బీసీలకు రాజ్యాధికారం కోసం మరో స్వతంత్ర పోరాటం పేరుతో నిర్వహిస్తున్న రథయాత్రను విజయవంతం చేయాలని బీసీ సంఘ జిల్లా అధ్యక్షుడు వియ్యపు అప్పలస్వామి పిలుపునిచ్చారు. జగ్గంపేటలో ఆదివారం బీసీల రథయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న ప్రారంభమైన రథయాత్ర సోమవారం కాకినాడ జిల్లాలో అడుగు పెడుతుందన్నారు. తుని నుంచి జగ్గంపేట నియోజకవర్గం మీదుగా మురారి వరకూ కాకినాడ జిల్లాలో జరిగే యాత్రను విజయవంతం చేయాలని కోరారు. పలువురు బీసీ నేతలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తుని: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు గాను సోమవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తుని డిపో మేనేజర్ ఎన్.కిరణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 73827 81490 నంబర్‌కు ఫోన్ చేసి తెలియ పరచాలని ఆయన కోరారు.

దంత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో రోగులకు దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ప్రత్తిపాడు: కిర్లంపూడి మండలం రామచంద్రాపురంలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్, రాజానగరం జీఎస్‌ఎల్ డెంటల్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు దంత వైద్యం అందుబాటులో లేదన్నారు. దంత వ్యాధులకు చికిత్స పొందాలంటే దూర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తోందన్నారు. గ్రామీణులకు దంత వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకే ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. జీఎస్‌ఎల్ డెంటల్ ఆసుపత్రి వైద్యులు రామచంద్రాపురం, పాలెం, గోనేడ, సోమరాయునిపేట, తామరాడ తదితర గ్రామాలకు చెందిన సుమారు 400 మందికి వైద్య పరీక్షలు చేశారు. తుమ్మలపల్లి రమేష్ రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 200 మందిని మెరుగైన వైద్యం కోసం రాజానగరం జీఎస్‌ఎల్‌కు తరలించారు. కార్యక్రమంలో తామరాడ గ్రామ సర్పంచ్ తోట అయ్యన్న, ఎంపీటీసీలు గోకడ రాజా, బండారు ప్రసాద్, పలికల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

గౌరంపేటలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



గౌరంపేటలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గౌరంపేటలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సర్పంచ్ ఏసుబాబు సూచించారు.

జోరుగా పంట నష్టం నమోదు



టి.తిమ్మాపురంలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు

తుని రూరల్: మిచాంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వరి, పత్తి, ఇతర పంట నష్టాల నమోదును వ్యవసాయ అధికారులు ముమ్మరం చేశారు. మండలంలోని టి.తిమ్మాపురం, తేటగుంట, గవరపేట, హెచ్.కొత్తూరు, హంసవరం, తదితర గ్రామాల్లో ఆదివారం ఏఓ బి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వీఆర్వోలు పర్యటించి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. రైతుల నుంచి వివరాలను సేకరించి నమోదు చేసుకున్నారు. వీఏఏలు సేకరించిన సమాచారాన్ని వెనువెంటనే రైతు భరోసా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని ఏఓ అశోక్ కుమార్ తెలిపారు. తుపాను వల్ల దెబ్బతిన్న అన్ని పంటలకు నష్టం నమోదు చేస్తున్నామని, ఎక్కడైనా నమోదు కాకపోతే వెంటనే గ్రామాల్లో ఉన్న వ్యవసాయ, రెవెన్యూ అధికారులను రైతులు సంప్రదించాలన్నారు. ప్రాథమిక అంచనాల్లో 1800 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్టు గుర్తించామని తెలిపారు.



పంట నష్టం, బాధితుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న సిబ్బంది

హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీబీటీ నాయకులు

తుని: భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకు అన్నివర్గాల ప్రజలు కృషి చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ కోరారు. తుని డీబీటీ కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కొన్ని వర్గాలకు మానవ హక్కులు ఉండేవి కావని, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో మానవ హక్కులను కల్పించారన్నారు. దేశం కోసం అంబేడ్కర్ తన జీవితాన్ని త్యాగం చేశారని, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం మానవ హక్కులకు భంగం కలిగించే కుట్ర చేస్తోందని ఆరోపించారు. డీబీటీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ, దావీదు, రమణ తదితరులు పాల్గొన్నారు.

అంధులకు ఆశాజ్యోతి ఐబ్యాంక్



ఐబ్యాంక్ ద్వారా కంటిచూపు పొందిన వారిని పరిచయం చేస్తున్న నిర్వాహకులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అంధులకు ఆశాజ్యోతిగా బాదం బాలకృష్ణ ఐబ్యాంక్ నిలుస్తుందని కాకినాడ సీపోర్టు చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ మెర్ల మురళీధర్ పేర్కొన్నారు. కాకినాడ ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని బాదం బాలకృష్ణ ఐబ్యాంక్‌లో ఆదివారం 17వ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో మురళీధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న నాలుగు ప్రధాన ఐబ్యాంక్‌లలో కాకినాడ ఐబ్యాంక్ ఉండటం సంతోషమన్నారు. నేటి కాలంలో స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టీల సేవా కార్యక్రమాలు మరింత విస్తృతమౌతున్నాయని, సమాజ సేవలో వీటిపాత్ర మరింత ఏక్కువ కావడం సంతోషంగా ఉందన్నారు. లయన్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ మాట్లాడుతూ అంధత్వ నివారణకు కృషిచేస్తూ 17వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న ఐబ్యాంక్ ఫౌండేషన్‌కు అభినందనలు తెలిపారు.అనంతరం ఐబ్యాంక్ ద్వారా కంటిచూపు పొంది మొట్టమొదటి సారిగా తమ కుటుంబసభ్యులను చూసిన వారు తమ మధుర క్షణాల అనుభూతిని వేదికపై తెలియపరిచారు. ఐబ్యాంక్ ఫౌండర్ డాక్టర్ బాదం బాలకృష్ణ, చైర్మన్ దాకమ్రి శంకరరావు, కోశాధికారి దాసరి సాయికృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా కుంభాభిషేకం



కుంభాభిషేకానికి గోదావరి జలాలను తీసుకువస్తున్న మహిళలు

సామర్లకోట: స్థానిక అయోధ్యరామపురంలో కొలువైన అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహా కుంభాభిషేకం జరిగింది. 108 మంది మహిళలు గోదావరి జలాలను బిందెలతో తీసుకువచ్చి స్వామి, అమ్మవార్లకు అభిషేకించారు. పుట్టా సూరిబాబు ఆధ్వర్యంలో ఆలయం నుంచి భారీ ఊరేగింపుగా గోదావరి కాలువ వద్దకు మహిళలు వెళ్లి నీటిని తీసుకువచ్చి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో కార్తిక మాస పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది.

గ్రామాల్లో మోటార్ సైకిల్ ర్యాలీ



ఏలేశ్వరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వినోద్ మిశ్రా పార్టీ శ్రేణులు

ఏలేశ్వరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కామ్రేడ్ వినోద్‌మిశ్రా విగ్రహాల ఆవిష్కరణను విజయవంతం చేయాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో నాలుగు మండలాల్లో ఆదివారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని లింగంపర్తి, ఏలేశ్వరం, యర్రవరం మీదుగా జగ్గంపేట, కిర్లంపూడి, ప్రత్తిపాడు మండలాల్లో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ ఏలేశ్వరంలో ఈ నెల 18న వినోద్ మిశ్రా, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరిస్తామన్నారు. వినోద్ మిశ్రా వర్ధంతిని పురస్కరించుకుని అదే రోజు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గుమ్మడి రమణ, కంబాల బాలయ్య, క్రాంతికుమార్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ

ప్రత్తిపాడు: ఏలేశ్వరంలో ఈ నెల 18న నిర్వహించే అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కిర్లంపూడి, ప్రత్తిపాడు మండలాల్లో ర్యాలీ చేసి స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు.

జగ్గంపేట: వినోద్ మిశ్రా వర్ధంతి సందర్భంగా ఏలేశ్వరంలో ఈ నెల 18న నిర్వహించే వినోద్ మిశ్రా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణను విజయవంతం చేయాలని కోరుతూ వినోద్ మిశ్రా పార్టీ శ్రేణులు ఆదివారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

సంక్షేమ పథకాలే విజయ సోపానాలు

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి

పెద్దాపురం: రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా గెలిపిస్తాయని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ ఏడు పర్యాయాల పాటు నిర్వహించే పాదయాత్రలో భాగంగా ఐదవ రోజు ఆదివారం సామర్లకోట నుంచి మండలంలోని తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి పార్టీ నాయకులతో కలసి ఆయన వెళ్లారు. జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీరాఘవరావు, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, కౌన్సిలర్ దూది రాజు, నల్లల గోవిందు, సుందరెడ్డి రాజు, పార్టీ కార్యకర్తలు, అభిమానులతో వెళ్లిన ఆయనకు ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సీఎం జగన్ మరో 20 ఏళ్లపాటు సీఎంగా కొనసాగాలని ప్రత్యేక పూజలు చేశారు. వర్గాలకు అతీతంగా సంక్షేమ పాలన అందిస్తూ ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఒబిలిశెట్టి అబ్బాయి, ఉప సర్పంచ్‌లు గోలి రామారావు, వాసిరెడ్డి శ్రీనివాస్, అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జంతు విలాపం

- జోరుగా వన్యప్రాణుల వేట
- ఉచ్చులు, తుపాకులతో హతమార్చుతున్న వైనం
- వేటను అడ్డుకోవాలంటున్న ప్రజలు

గోకవరం: నియోజకవర్గంలోని అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల వేట జోరుగా సాగుతోంది. మాంసం కోసం కొందరు స్వార్థపరులు వన్యప్రాణులను వేటాడుతున్నారు. వేటగాళ్లు విద్యుత్ ఉచ్చులను ఏర్పాటు చేసి వీటి మాంసాన్ని విక్రయిస్తుండగా మరికొందరు తుపాకులతో వేటాడుతూ వికృతానందం పొందుతున్నారు. ఈ చర్యల వలన వన్యప్రాణుల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది.

మూడు అటవీ రేంజ్‌ల పరిధిలో..

గోకవరం మండలంలోని సూదికొండలో ఫోక్స్‌పేట రేంజ్, గోకవరంలో ఇందుకూరు రేంజ్, రాజమహేంద్రవరం రేంజ్‌లు ఉన్నాయి. గోకవరం, జగ్గంపేట మండలాల్లో దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. గోకవరం మండలంలో మల్లవరం, సూదికొండ, తిరుమలాయపాలెం, గంగంపాలెం, రంపయర్రంపాలెం ప్రాంతాల్లో, జగ్గంపేట మండలంలోని బావారం, ఇర్రిపాక, గండేపల్లి మండలం సరిహద్దు ప్రాంతం వరకు అటవీ ప్రాంతం విస్తరించి ఉంది.

176 రకాల పక్షి జాతులు

ఈ అటవీ ప్రాంతంలోని కొండల్లో అడవి పందులు, కణుజులు, గొర్రెగేదెలు, చుక్కలదుప్పి, కొండగొర్రెలు ఉన్నాయి. అలాగే 176 రకాల పక్షి జాతులను గుర్తించారు. ఆయా రేంజ్‌ల పరిధిలో ముసురుమిల్లి ప్రాజెక్టు, ఏలేరు ప్రాజెక్టు, సూరంపాలెం ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల వద్దకు వేసవిలో దాహార్తిని తీర్చుకునేందుకు అనేక అడవి జంతువులు వస్తుంటాయి. వీటి కోసం కొందరు వేటగాళ్లు విద్యుత్ ఉచ్చులను అమర్చుతున్నారు. జగ్గంపేట మండలం బావవరం, నరేంద్రపట్నం, ఇర్రిపాక శివారుల్లో, గోకవరం మండలం మల్లవరం, తిరుమలాయపాలెం, గంగంపాలెం గ్రామ శివారుల్లోని అటవీ ప్రాంతాల్లో ఎక్కువగా ఉచ్చులు, విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసి వన్యప్రాణులను వేటాడుతున్నారు. ఇటీవల తుపాకులతో వీటి వేటను కొనసాగిస్తున్నారు. మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు అటవీ ప్రాంతంలో జంతువులను వేటాడుతున్నారు.

తుపాకుల స్వాధీనం

గోకవరం మండలం తిరుమలాయపాలెం అటవీ ప్రాంతంలో ఇటీవల తుపాకులతో వన్యప్రాణులను వేటాడేందుకు ప్రయత్నించిన పలువురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి తుపాకులను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గత కొంతకాలంగా అటవీ ప్రాంతంలో తుపాకులతో వేటాడుతున్నట్టు అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. వన్యప్రాణుల వేటను అరికట్టడంలో అటవీశాఖ అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల వేటను అరికట్టాలని ప్రజల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.



అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న తుపాకీ (ఫైల్)

కఠిన చర్యలు తీసుకుంటాం



అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గత రెండేళ్లలో సుమారు ఐదు కేసుల్లో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశాం. వన్యప్రాణులను వేటాడితే కఠిన శిక్షలు అమలులో ఉన్నాయి. ఫోక్స్‌పేట రేంజ్ సిబ్బంది కొరత ఉంది. అయినప్పటికీ గస్తీ నిర్వహించి వేటను అడ్డుకుంటాం. రిజర్వు ఫారెస్టులో అనుమతి లేకుండా ప్రవేశిస్తే నాన్ బెయిల్‌బుల్ కేసులు నమోదు చేస్తాం

– ఎం.కరుణాకర్, ఫోక్స్‌పేట రేంజ్ అధికారి, గోకవరం మండలం